ప్రజాశక్తి
శనివారం 6 జులై 2024
5
శ్రీ సత్యసాయి

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

రుణ మంజూరులో జాప్యం చేయొద్దు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

దారిద్ర రేఖకు దిగువ ఉన్న కుటుంబాలను అభివృద్ధి చేయడానికి బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల రివ్యూ కమిటీ సమావేశాన్ని జెసి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, వ్యవసాయం, డీఆర్డీఏ, మెప్మా తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ఆయా శాఖల పరిధిలోని వివిధ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకు ద్వారా విరివిగా రుణాలు అందించాలని ఆయన ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు స్టాండ్ అప్ ఇండియా పథకం కింద రుణాలు అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఏ కారణం చేతనైన రుణాలు ఇవ్వలేని పక్షంలో దరఖాస్తులను తిరస్కరించిన సంబంధిత నివేదికలను తనకు పంపాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు విరివిగా రుణాలు అందించాలని నిర్లక్ష్యం వహించిన బ్యాంకులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా సంక్షేమ శాఖలకు సంబంధించిన అధికారులు తగిన ప్రణాళికలతో రావాలని ఏ మండలంలో ఎంత మంది లబ్ధిదారులు అర్హత సాధించారని బ్యాంకులవారీగా వివిధ కులాల వారీగా జాబితాలు సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రుణాలు అందజేయాలన్నారు. కోళ్లు, పొట్టేళ్లు, పందుల యూనిట్లకు సబ్సిడీ రుణాలు అందజేయాలన్నారు. ఈ ఏడాది ఎంఎస్ఎం ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు 150 కోట్ల రూపాయలు రుణ సదుపాయం కల్పించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. జిల్లాలోని 23 బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. నాబార్డ్ ద్వారా చేపట్టే పలు పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఇంకా 49 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు వివిధ బ్యాంకులు రుణాలు త్వరితగతిన అందజేయాలని పేర్కొన్నారు. అనంతరం లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రొటెన్షియల్ క్రెడిట్ ప్లాన్ అనే పుస్తకాన్ని జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఐ ప్రతినిధి గిరిధర్, నాబార్డ్ డీడీఎం అనురాధ, ఎల్డీఎం రమణకుమార్, ఏపీజీబి బ్యాంకు ప్రతినిధి రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, మెప్మా పీడీ విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ అధికారి జిఎం చాంద్‌బాషా, జౌళి చేనేత అధికారి రమేష్, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగప్రసాద్, నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

టిబి డ్యామ్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

- తుంగ నుంచి దిగువకు నీరు
- హెచ్‌ఎల్‌ఎంసిపై పెరుగుతున్న ఆశలు
- పంట సాగుకు కలిసొచ్చే అవకాశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్నాయి. మొన్నటి వరకు డ్యామ్ పైభాగంలో వర్షాల్లేక నీరు అట్టడుగు స్థాయికి చేరింది. ఐదు టిఎంసిల్లోపే ఉంది. గడిచిన రెండు రోజులుగా తుంగ పైభాగంలో వర్షాలు పడటంతో తుంగభద్ర డ్యామ్‌కు నీరు పుష్కలంగా వచ్చాయి. దీంతో తుంగ డ్యామ్ నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. 21 గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు. దీంతో తుంగభద్ర డ్యామ్‌కు 19 వేల క్యూసెక్కులకు నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం పది టిఎంసిలకు చేరింది. రాబోయే రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలున్నాయి.

హెచ్‌ఎల్‌ఎంసిపై ఆశలు

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువపై ఆశలు రేకెత్తుతున్నాయి. ఈ ఏడాది 26 టిఎంసిలు నీటి కేటాయింపులను జూన్ మాసంలో జరిగిన మొదటి తుంగభద్ర బోర్డు మీటింగ్‌లో నిర్ణయం చేశారు. రెండో సమావేశం సమయానికి నీటి కేటాయింపులపై స్పష్టత రానుంది. జూన్ మొదటి వారంలో మంచి వర్షాలు పడినప్పటికీ అప్పటి నుంచి వర్షాల్లేకపోవడంతో తుంగభద్ర డ్యామ్‌లో నీరు పూర్తి స్థాయిలో రాలేదు. దీంతో జులైలో అయినా నీరు డ్యామ్‌కు వస్తుందా లేదా అన్న సందేహం నెలకొని ఉండింది. రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు ఇన్‌ఫ్లోస్ పెరుగుతుండటంతో హెచ్‌ఎల్‌ఎంసిపై ఆశలు రేకెత్తాయి. సాధారణంగా జులై 20వ తేదీ నుంచి జిల్లాకు నీరు తీసుకోవాలని సాగునీటి అధికారులు అంచనా వేశారు. ఇప్పుడొచ్చే నీళ్లతో ఆ సమయం నుంచి నీటిని విడుదల చేయించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతేడాది వర్షాభావంతో నీరు తగినంత రాలేదు. 26 టిఎంసిలు వస్తాయనుకుంటే 16 టిఎంసిలే వచ్చాయి. ఈ ఏడాది అయినా పూర్తి స్థాయిలో నీరు జిల్లాకు చేరితేగాని కష్టాలు తప్పేలాలేవు. ఎందుకంటే జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. నీరు పూర్తి స్థాయి అడుగంటాయి.

ఆయకట్టు రైతుల్లో ఆశలు

జులై 20 నుంచి తుంగభద్ర ప్రధాన కాలువ నీరొస్తుందని భావించి ఆయకట్టు ప్రాంతాల్లో రైతులు నార్లు పోసుకుంటున్నారు. సకాలంలో వస్తే ఆయకట్టు రైతులు ఈసారి పూర్తి స్థాయిలో పంటలు సాగు చేససుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతేడాది సకాలంలో నీరు రాక చివరి ఆయకట్టు రైతులకు నీరందక నార్లు ముదిరిపోవడంతో పంటలు సాగు చేసుకోలేదు. ఈసారైన నీరు వచ్చి ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో నీరందుతుందని ఆశాభావంతోనున్నారు. ఒకవైపు వర్షాలు జిల్లాలో జూన్‌లో బాగా పడిన ఆ తరువాత నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మేఘాలు కమ్ముకుని వస్తున్నా వర్షం పడటం లేదు.

గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

గడ్డి తిని పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పరిగి

వేతనాలు ఇవ్వకుంటే గడ్డి తిని బతకాలా అని పంచాయతీ కార్మికులు పచ్చి గడ్డి తిని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాల కోసం పంచాయతీ కార్మికులు స్థానిక సచివాలయం వద్ద చేపట్టిన సమ్మె 5వ రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల కు 10 నెలల నుంచి జీతాలు చెల్లించకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచికి విన్నవించినా ఫలితం లేదన్నారు. దీంతో విధి లేని పరిస్థితిలో సమ్మె చేపట్టారన్నారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులను సర్పంచి భర్త శివశంకర్ విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు దిగడం దారుణమన్నారు. కార్మికులను బెదిరిస్తే ఊరుకునేది లేదని అవసరమైతే సిఐటియు ఆధ్వర్యంలో సర్పంచి ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. శిబిరంలో కార్మికుల యూనియన్ నాయకులు మూర్తప్ప, రామంజి, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే ఆరోగ్యకర సమాజం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజలందరూ సహకరిస్తే సమాజం ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉందని డిపిఎంఒ డాక్టర్ కుళ్లాయప్పనాయక్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో డిపిఎంఒ, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్, వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కలుషిత నీరు, ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండటం వల్ల పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రతిఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ కార్మికులు, వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండటం వల్ల ప్రజలకు పరిశుభ్రత గురించి తెలుస్తుందన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా పరిశుభ్రత పాటిస్తూ ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు పారిశుధ్యంపై మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, ఏఎంబి లక్ష్మీ నాయక్, ఎంఎస్‌యుఒ రమణయ్య, సిహెచ్ఒ నగేష్, సచివాలయాల కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిపిఎంఒ డా॥కుళ్లాయప్ప నాయక్

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

సీజనల్ వ్యాధులు, అతిసార నియంత్రణపై ప్రశాంతిగ్రామ్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎన్‌సిడిసిడి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత ఆధ్వర్యం లో అంగన్వాడీ కేంద్రాన్ని పశీలించి పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ఆరా తీశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అతిసార వ్యాధి లక్షణాలు, చికిత్స గురించి వివరించారు. కార్యక్రమంలో సామజిక ఆరోగ్య అధికారి నగేష్, ఆరోగ్య కార్యకర్త అమృత, ఆశా కార్యకర్త అనిత, అంగన్వాడీ టీచర్ నర్మద పాల్గొన్నారు.

పోలీస్ జాగిలం 'శాండీ' సేవలు మరువలేనివి

ఎస్పీ మాధవరెడ్డి

పోలీసు జాగిలంను సత్కరిస్తున్న ఎస్పీ, తదితరులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీస్ శాఖకు జాగిలం శాండీ అందించిన సేవలు మరువలేనివని ఎస్పీ ఎస్వీ.మాధవరెడ్డి కొనియాడారు. జిల్లా పోలీస్ శాఖలో డాగ్ స్క్వాడ్‌గా ఉన్న జాగిలం శాండీ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం స్థానిక పరేడ్ మైదానంలో ఎస్పీ శాండీకి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. శాండీ హైదరాబాద్‌లోని డాగ్ స్క్వాడ్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పూర్తి చేసుకొని ఉమ్మడి అనంతపురం జిల్లాలో విఐపి, వివిఐపి విధులను సమర్థవంతంగా నిర్వహించిందని కొనియాడారు. 2015లో జరిగిన గోదావరి పుష్కరాల్లో కూడా సేవలందించింద న్నారు. 11 ఏళ్ల శాండీ సేవలు ముగియడంతో పరేడ్ మైదానంలో అందరి సమక్షంలో గౌరవంగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. ముమ్మందు కూడా శాండీని పోలీస్ సంరక్షణలోనే బాగా చూసుకోవాలని హ్యాండ్లర్ చెన్ననాయక్‌ను ఎస్పీ ఆదేశిం చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు చంద్రశేఖర్, వలి, రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-ముదిగుబ్బ



విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల గురించి అధికారులతో మాట్లాడుతున్న ఎంపిపి

మలక వేమల క్రాస్ సమీపాన నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్లను కోరారు. వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ముదిగుబ్బ మండలంలోని మలకవేముల క్రాస్ సమీపంలో ఉన్న 132కెవి విద్యుత్ సరఫరా ప్లాంట్‌ను శుక్రవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనుల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. 132కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ప్లాంట్ పనులను త్వరితగతిని పూర్తి చేయాలని డిఇ శ్రీధర్‌ను కోరారు. సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయితే చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి వెంకటరమణ, ఎంపీటీసీ మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణకు వైద్యశిబిరం

ప్రజాశక్తి-బుక్కపట్నం

డయేరియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ లింగ రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బుచ్చయ్య గారిపల్లి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులను పరీక్షించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు, గర్భిణుల పౌష్టిక ఆహారం గురించి వివరించి అతిసారపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు అతిసారా వ్యాధి లక్షణాలు చికిత్స గురించి అవగాహన కల్పిస్తూ ఒఆర్ఎస్, జింక్ మాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్, వైద్య సిబ్బంది అరుణ, మురళీకృష్ణ, గ్రామ కార్యదర్శి వర్షా ప్రియదర్శిని, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే గుర్తింపు

ప్రజాశక్తి-బుక్కపట్నం

గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులతోపాటు క్రీడలలో రాణించి రాష్ట్రస్థాయిలో సత్తా చాటలని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్ బాషా, షూటింగ్ బాల్ జిల్లా సెక్రటరీ మనోహర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో రాష్ట్రస్థాయి సీనియర్స్ విభాగంలో ఉమ్మడి జిల్లా షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాలని తెలిపారు. ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి చరణ్ కుమార్, తరుణ్, హర్షవర్ధన్, సాయి జస్వంత్, నవీన్, గణేష్, నారాయణస్వామి, కేదార్నాథ్, మారుతి, రాజా, బాలికల విభాగం నుంచి వర్ధిని, అక్షయ, శాలిని, మైత్రి, రక్షిత, సాయి భార్గవి, తదితరులు ఎన్నిక అయ్యారు. వీరంతా ఆగస్టు నెలలో గుంటూరులో జరిగే 43వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈకార్యక్రమంలో షూటింగ్ జాయింట్ సెక్రటరీ పూల శివప్రసాద్, ప్రధానోపాధ్యాయులు జగదీష్, కస్తూరిబా స్కూల్ ఎస్ఒ సౌజన్య, పీడీలు నాగరాజు, జయప్రసాద్, రేఖ, రమాదేవి, పీఈటీలు స్వర్ణకుమారి, నవనీత, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి

మంత్రిని కోరిన యుటిఎఫ్

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 117జీవోను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రితో యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల విలీనం చేపట్టి ప్రాథమిక విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో ఉన్న 3,4,5 తరగతుల విలీన ప్రక్రియను రద్దు చేసి ఆ తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలకు పంపాలన్నారు. పాఠశాలల సబ్జెక్టు టీచర్లను కేటాయించాలన్నారు. బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్యపై మున్సిపల్ అధికారులతో సంప్రదించి సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో విలీనం చేయబడిన ఎయిడెడ్ పాఠశాలల నాన్‌టీచింగ్ సిబ్బందిని అవసరమైన ఉన్నత పాఠశాలల సిబ్బందిగా నియమించాలని కోరారు. మంత్రి స్పందిస్తూ ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, సునీల్ కుమార్, సీనియర్ నాయకులు నారాయణ స్వామి, రమేష్, రవీంద్రనాథ్, నబీ, ఉపేంద్ర, గంగాధర్, అశ్వర్థప్ప, లక్ష్మా నాయక్, ఓబిలేసు సోమశేఖర్, మల్లిఖార్జున, ఖాజా మోహినూద్దీన్, రామాంజినేయులు, నరసింహులు, శేషాద్రి, ఆది, జినేష్ గోవిందప్ప, నాగేశ్వర్ రెడ్డి, నాగేంద్ర, నరేష్, బాషా పాల్గొన్నారు.

సతీష్ హత్యతో టిడిపికి సంబంధం లేదు

- బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తాం
- విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం గోళాపురం గ్రామ యువకుడు సతీష్ హత్యకు టిడిపి నాయకులకు ఎటువంటి సంబంధం లేదని, హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఇప్పటికే ఎమ్మెల్యే బాలకృష్ణ స్థానిక పోలీస్ అధికారులను ఆదేశించారని టిడిపి నాయకులు తెలియజేశారు. గత రెండు రోజుల క్రితం గోళాపురం గ్రామానికి చెందిన సతీష్‌పై అదే గ్రామానికి చెందిన వారు చెరువులోకి తీసుకెళ్లి దాడి చేసి గాయపర్చారన్నారు. సతీష్‌ను టిడిపి కార్యకర్తలే హత్య చేశారని కొంత మంది ఆరోపించడం సరికాదన్నారు. హిందూపురం నియోజవర్గంలో హత్యలు, దౌర్జన్యాలు, అక్రమాలను ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రోత్సహించరన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని ఉపేక్షించమన్నారు. నియోజవర్గంలో గంజాయి డ్రగ్స్ విచ్చలవిడి అవ్వడానికి కారణం వైసిపి నాయకులు అన్నారు. వాటిని అరికట్టడానికి ఎమ్మెల్యే గట్టి చర్యలు చేపట్టబోతున్నారని చెప్పారు. వ్యక్తుల మధ్య పాత కక్షలు, ఘర్షణలో చనిపోతే దానికి టిడిపి నాయకులు కారణం అని వైసిపి నాయకులు ఆపాదించడం ఎంత వరకు సమంజసం అన్నారు. సంబంధం లేని సంఘటనలో టిడిపి పై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. బాదిత కుటుంబానికి న్యాయం జరిగే విషయంలో టిడిపి ముందుంటుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ అశ్వత్ రెడ్డి, మాజీ జడ్పిటిసి ఆదినారాయణ, పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్ కుమార్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, ఐ టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు రామాంజనేయులు, మాజీ సర్పంచి రాము, సర్పంచి చక్కీరప్ప, మాజీ సర్పంచులు హనుమంత రాయుడు, సంతేబీదనూరు శ్రీరాములు, మాజీ ఎంపీటీసీలు ఆంజనేయులు, అంజి, రామచంద్ర, నాయకులు ఆదినారాయణ రెడ్డి, రామకష్టారెడ్డి, అంజన రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం సురక్షితం

ప్రజాశక్తి- లేపాక్షి

స్థానిక పిహెచ్‌సిలో ప్రతి నెలా మొదటి శుక్రవారం నిర్వహించే వైద్య పరీక్షల్లో భాగంగా వైద్యాధికారి వెంకట చిరంజీవి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 70 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సూచనలు సలహాలు ఇచ్చారు. వైద్యులు మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి నెలా వ్యాక్సిన్లు వేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. మానసిక ఒత్తిళ్లకు గురికారాదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం సురక్షితమని, కావున ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేయించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే (నగదు రూపంలో) పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లేపాక్షి వీరభద్రాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కరణం రమానందన్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ సుదర్శన్, వైద్య, ఆరోగ్య సిబ్బంది రమానందన్, మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ చిత్రపటాల అందజేత

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎస్పీ మాధవరెడ్డికి ఫొటో అందించి సత్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను పలు ప్రభుత్వ కార్యాలయాలలో జనసేన పార్టీ నాయకులు అందజేశారు. శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డికి, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో భాగ్యరేఖకు పవన్ కళ్యాణ్ చిత్రపటాలను అందించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ పట్టణంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినందున ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫొటో కూడా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సారత్యంలో రాష్ట్రం అభివద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బొగ్గరం శ్రీనివాసులు, గాజుల నాగేంద్రప్రసాద్, మేకల ఈశ్వర్, పూల గోవర్ధన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో హోంగార్డుల సేవలు భేష్ : ఎస్పీ

హోంగార్డుకి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సార్వత్రిక ఎన్నికల్లో హోంగార్డుల సేవలో భేష్ అని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ప్రశంసించారు. జిల్లాలో జరిగిన అన్ని విబిపి, వివిపిపి కార్యక్రమాలతో పాటు ఎన్నికల్లో బాగా విధులు నిర్వహించినందుకు శుక్రవారం స్థానిక పరేడ్ మైదానంలో హోంగార్డుల అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథి ఎస్పీ 298 మంది హోంగార్డులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సమిష్టి కృషితోనే జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. ముందుగా ఆదే స్ఫూర్తి కొనసాగించి జిల్లాను ప్రశాంతంగా ఉంచడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్ఐలు వలి, చంద్రశేఖర్, రవికుమార్, ఆర్ఎస్ఐలు, ఎఆర్ ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరిటాల సునీతకు విరాళం అందజేస్తున్న పింఛనుదారులు

'అమరావతి'కి పింఛనుదారుల విరాళం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రామగిరి మండలంలోని కొత్తగాదిగుట్లం గ్రామానికి చెందిన పింఛనుదారులు విరాళం ఇచ్చారు. పింఛను దారులు శుక్రవారం రూ. 64వేలు సేకరించి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు అందజేశారు. భావితరాల కోసం నూతన రాజధాని అమరావతి నిర్మాణానికి తమ వంతుగా పింఛను సొమ్ములో కొంత విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. వారిని ఎమ్మెల్యే పరిటాల సునీత అభినందించి మాట్లాడారు. 2019లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ఉంటే ఇప్పటికే మన రాజధాని నిర్మాణం పూర్తయి ఉండేదన్నారు. కానీ జగన్‌రెడ్డి అరాచకం వల్ల రాష్ట్ర ప్రజలకు మన రాజధాని ఇది అని చెప్పుకునే పరిస్థితి లేకుండా చేశారన్నారు. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాని కచ్చితంగా మన కలల రాజధాని నిర్మాణం పూర్తవుతుందన్నారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు తగదు

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల వ్యాప్తంగా అంగన్వాడీ సిబ్బంది, స్కూల్ స్వీపర్స్, యానిమేటర్స్, ఫీల్డ్‌అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, తదితర రంగాల్లో పని చేసే కార్మికులపై అధికార పార్టీ నాయకులు వేధింపులకు పాల్పడడం, భయభ్రాంతులకు గురి చేయడం తగదని సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ, నాయకులు శ్రీరాములు పేర్కొన్నారు. నల్లచెరువులో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం మారిన ప్రతిసారీ అధికార పార్టీ నాయకులు చిరుద్యోగుల జీవితాలను బలి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ విధానాలు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో పేదల జీవితాలను ఛిన్నాభిన్నం చేసిన పాపం అందరూ పంచుకోవాల్సి వస్తుందని సాధించేదేమి ఉండదని హితవు పలికారు. ఇకనైనా అలాంటి విధానాలను ఉపసంహరించుకుని వారి పని వారిని చేసుకోనేందుకు సహకారం అందించాలని కోరారు.

ఉపాధ్యాయుడిని సన్మానం చేస్తున్న తోటి ఉపాధ్యాయులు

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం

పరిగి : మండలంలోని శాసనకోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు డి.కృష్ణమూర్తి ఉద్యోగోన్నతి బదిలీపై సోమందేపల్లి జడ్పీ హైస్కూల్‌కు వెళ్లారు. దీంతో శుక్రవారం శాసనకోట పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎఇఒలు లక్ష్మీదేవి, శేషాచలం హాజరై మాట్లాడుతూ పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపడమే కాకుండా విద్యార్థులను ఉన్నత స్థాయి కి తీసుకెళ్లడంలో కృష్ణమూర్తి కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనందరాజు, జయకృష్ణ, యుటిఎఫ్ నాయకులు మహంతి, సుల్తాన్, శంకర్, ఎపిటిఎఫ్ నాయకులు రవి, పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు రేబిస్ టీకా

గాండ్లపెంట : జోనోసిస్ దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తారని పశు వైద్యాధికారి చెన్నకేశవులునాయక్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు రేబిస్ టీకా వేస్తే ప్రజలు, పాడిపశువులపై దాడి చేసినా ప్రమాదం ఉండదన్నారు. పెంపుడు కుక్కలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జూలై 18 నాటికల్లా మాకు అందేట్టు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవివిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్

సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సహకారంతో జనసేన, టిడిపి, బిజెపి నాయకులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి, తద్వారా నియోజకవర్గంలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో శుక్రవారం యువ నాయకుడు మారుతిరెడ్డి అధ్యక్షతన కూటమి నాయకులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి గెలుపు కోసం జనసేన పార్టీ నాయకులు అహర్నిశలు కష్టపడ్డారని తెలి పారు. పర్యావరణవేత్త భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలో విద్యార్థుల చేత 65 వేల మొక్కలు నాటడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కూటమి విజయానికి కృషి చేసిన నాయకులను భాస్కర్ నాయుడు, మారుతిరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముమ్మినేని వెంకట్రాముడు, గోపాల్ నాయక్, బిజెపి నాయకులు హనుమంతరెడ్డి, శేషాద్రినాయుడు, బాలగంగాధర్, జిల్లా కార్యదర్శి నరసింహులు, నాగేంద్ర, జనసేన నాయకులు జయరాం, ఈశ్వర్ నాగేంద్ర, శ్యాంసుందర్, దేవేంద్రనాయక్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందుకున్న విద్యార్థులతో ట్రస్టు నిర్వాహకులు

విద్యార్థులకు 'చేయూత'

ప్రజాశక్తి-హిందూపురం

చేయూత సేవా ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు శుక్రవారం పట్టణంలోని చౌడేశ్వరీకాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు మధు సూదన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక మదర్స్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ భానుతేజ, డాక్టర్ బిఎల్ నిఖిల చేయూత సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద విద్యార్థుల ను ఆదుకోవడం హర్షణీయమన్నారు. ట్రస్టు నిర్వాహకులు మాట్లాడుతూ తమకు ఉన్న దానిలో ఎంతో కొంత సమాజ సేవ చేయాలని సంకల్పించి ట్రస్టు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామన్నారు. ఏటా పాఠశాల లు ప్రారంభ సమయంలో విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలతో పాటు విద్యా సామగ్రిని అందిస్తున్నామన్నారు. విద్యార్థులు వీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులతో పాటు ఉపాధ్యాయులు ప్రేమలత, లక్ష్మీదేవి, మక్తర్, కృష్ణారావు, ప్రభాకర్, వసుధ, ధనలక్ష్మి, షామీద, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

'అరుణాచలం'కు ప్రత్యేక బస్సు

ధర్మవరం టౌన్ : ఈ నెల 21వ తేదీ పౌర్ణమి సందర్భంగా ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు 20వ తేదీ ఉదయం 6 గంటలకు బయల్దేరుతుందని, రానుపోనూ ఛార్జీలు రూ. 1400 ఉంటుందన్నారు. సీట్లు బస్టాండ్ కౌంటర్‌లో కానీ రిజర్వేషన్ కానీ చేసుకోవచ్చ న్నారు. వివరాలకు 63031 51302, 99592 25859 నెంబర్లలో సంసంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కదిరి టౌన్ : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలు సాగు చేయాలని ఎడిఎ సనావుల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. వారు శుక్రవారం రూరల్ మండలంలోని దిగువపల్లి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, కషాయాలు, ఘన జల జీవామృతాల తయారీపై వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గి రైతులకు పెట్టుబడి తగ్గడమే కాగా ఆరోగ్యకరమైన పంటను పండించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. అనంతరం రైతు గంగినాయుడు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన టమో టా పంటను సందర్శించారు. వారి వెంట ఏవో శ్రీనివాసరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రభుత్వాసుపత్రిలో తల్లి గర్భంలోనే శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

ప్రసవం కోసం వచ్చిన మహిళ గర్భంలోనే శిశువు మృతి చెందిన సంఘటన శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుంది. దీనికి సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. హిందూపురం పట్టణ పరిధిలోని కొల్లకుంట గ్రామానికి చెందిన ముత్యాలమ్మ ఐదోసారి గర్భం దాల్చింది. 9 నెలలు పూర్తవడంతో ప్రసవం కోసం ఉదయం జిల్లా ఆసుపత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యురాలు అడ్మిట్ చేసుకుంది. అన్ని పరీక్షలు చేయడంతో పాటు ఓ ప్రయివేట్ స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ చేయించారు. దీంతో బిడ్డ అప్పటికే కడుపులోనే మృతి చెందినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఆమె గర్భిణి కుటుంబ సభ్యులు వైద్యులు, ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఉదయం 10 గంటలకు ఆసుపత్రికి వస్తే సాయంత్రం వరకూ సమయం వృథా చేశారని, వారి నిర్లక్ష్యం వల్లే బిడ్డ చనిపోయిందని మహిళా ఆరోగ్య సిబ్బందితో వాదనకు దిగారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సూపరిటెండెంట్ రోహిల్ అక్కడికి చేరుకుని గర్భిణి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అలాగే గర్భిణికి సంబంధించిన మాతా శిశు సంరక్షణ నమోదు పుస్తకాన్ని పరిశీలించగా అందులో ఎలాంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు నమోదు చేయకపోవడంతో అవక్కయ్యారు. పిహెచ్‌సి ద్వారా నిర్దేశించిన సమయాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉంటే ఇలాంటి సంఘటన జరిగేది కాదని అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై సంబంధిత అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణి ముత్యాలమ్మ 7వ నెల నుంచి నమోదు చేసుకుందని, అప్పటి నుంచి ప్రతివారం, ప్రతి నెలా వైద్య పరీక్షల కోసం పిలవడానికి వెళ్తే రాకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఇందులో తమ తప్పు ఏమాత్రం లేదని తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

కొత్తచెరువు : కొత్తచెరువులోని ఎరువుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ అధికారి నటరాజు తనిఖీ నిర్వహించారు. స్థానిక ధర్మవరం రోడ్డులో ఉన్న మన గ్రోమోర్ సెంటర్, శ్రీసాయి ట్రేడర్స్, లక్ష్మీగణేష్ ఫర్టిలైజర్స్ దుకాణాలకు వెళ్లి ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నిల్వలను పరిశీలించారు. వీటిని రైతులకు ఎంఆర్‌పికే విక్రయించాలని, తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. నిబంధనల మేరకు వ్యాపారాలు కొనసాగించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారి నటరాజు

డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తున్న టీడీపీ నాయకులు

డ్రెయినేజీలు శుభ్రం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని పార్థసారధినగర్‌లో శుక్రవారం టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు మాధవరెడ్డి, మంజు డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. వార్డులో ఎక్కడ చూసినా డ్రెయినేజీలు పూడిపోయి వర్షం కురిస్తే నీరంతా రోడ్లపై ప్రవహించి దుర్వాసన వెదజల్లేది. డ్రెయినేజీలు శుభ్రం చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

'సదరం సర్టిఫికెట్ స్లాట్' నమోదు చేసుకోండి

పెనుకొండ టౌన్ : దివ్యాంగులు సదరం క్యాంపులో సర్టిఫికెట్ పొందేందుకు జులై, ఆగష్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన స్లాట్లను ప్రభుత్వం విడుదల చేసిందని, అర్హులు గ్రామ, వార్డు సచివాల యాల్లో దరఖాస్తు చేసుకోవాలని టిడిపి నాయకులు తెలిపారు. అనంతరం వారు చెరువు రోడ్డు, తదితర కాలనీల్లో పర్యటించి డ్రెయినేజీ, శానిటేషన్ సమస్యలను, కోనాపురంలో తాగునీటి సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములుయాదవ్, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత్ ఫుట్‌బాల్ జట్టుకు ద్వారకనాథ్‌రెడ్డి



ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురానికి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు ద్వారక హరినాథ్‌రెడ్డి కుమారుడు ద్వారకనాథ్‌రెడ్డి భారత జట్టుకు ఎంపికైనట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హబీబుల్లా, కార్యదర్శి నరేంద్రచౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారక్‌నాథ్‌రెడ్డి ఈనెల 9న శ్రీలంకలో జరిగే ఎస్‌ఎబిఎ కప్ పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు.

సచివాలయానికి తాళం తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కదిరి టౌన్

అద్దె చెల్లించలేదన్న కారణంతో గురువారం గ్రామ వార్డు సచివాలయ కార్యాలయానికి భవన యజమాని తాళం వేసిన విషయం విదితమే. ఈ సంఘటనపై శుక్రవారం ప్రజాశక్తిలో 'సచివాలయానికి తాళం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఆ భవన యజమానితో మాట్లాడి గడిచిన 3 నెలలకు సంబంధించిన రూ. 19,500 అద్దెను సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశామని, కొన్ని సమస్యల కారణంగా కొంత ఆలస్యం కావడంతో అద్దె చెల్లించలేక పోయామని, త్వరలోనే సమస్యను పరిష్కరించి అద్దె చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో భవన యజమాని సహమీరియా సచివాలయ భవనానికి వేసిన తాళం తొలగించారు.

తెరిచిన సచివాలయ భవనం

భూసార పరీక్షల మేరకు ఎరువులు వాడాలి

ఆత్మా పీడీ మద్దిలేటి

ప్రజాశక్తి-నార్పల

భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఆధారంగానే రైతులు ఎరువులు వాడాలని ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 'స్కూల్ సాయిట్ హెల్త్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 8, 9, 10, తరగతి విద్యార్థులకు మట్టి నమూనా పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ్లపల్లికి చెందిన రైతుల పొలాల్లో దాదాపు 50 మట్టి నమూనా శాంపిల్స్ తీసి భూసార పరీక్ష కేంద్రానికి పంపనున్నట్లు తెలిపారు. మట్టి నమూనా పరీక్షల అనంతరం అందుకు అనుగుణంగా రైతులు ఎరువులను వాడాలని సూచించారు. భూ సారంలో ఉండే పోషకాల విలువలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకుని ఎరువులు వాడితే దిగుబడులు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రోజా పుష్పలత, అనంతపురం వ్యవసాయ అధికారి నాగేంద్ర, మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారి రాము, బండ్లపల్లి రైతుసేవా కేంద్రం శశిధర్, సిద్ధరాచెర్ల రైతుసేవా కేంద్రం కుపేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

రాయదుర్గం రూరల్ : అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఎడిఎ లక్ష్మానాయక్ హెచ్చరించారు. శుక్రవారం రాయదుర్గంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణదారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న తరుణంలో రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువు లు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలు, ఎరువుల ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రైతులు సలహాలు, సూచనల కోసం 155251 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవ చ్చున్నారు. ఈ కార్యక్రమం లో రాయదుర్గం మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, డీలర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న బాధితురాలు నాగలక్ష్మి

కిరాణా షాపు దగ్ధం.. రూ. 5 లక్షలు నష్టం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలో గురువారం అర్ధరాత్రి ఓ కిరాణా షాపులో మంటలు చెలరేగి కాలి బూడిదవడంతో రూ. 5 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు.. స్థానిక సదాశివ పురంలో నాగలక్ష్మి 20 ఏళ్లుగా కిరాణా దుకాణం నిర్వహిస్తోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో మూసి ఉన్న షాపులో నుంచి పొగ రావడంతో గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో షాపు నిర్వాహకురాలు, ఆమె బంధువు కౌన్సిలర్ నరసింహరాజు అక్కడికి చేరుకుని షాపు తెరిచి పరిశీలించగా కిరాణా సరుకులు, ఫ్రిడ్జ్, కౌంటర్ మొత్తం కాలి బూడిదయ్యాయి. దీంతో రూ. 5 లక్షల నష్టం వాటిల్లిందని, ఆదుకోవాలని బాధితురాలు తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అంద జేశారు. విషయం తెలియడంతో శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కిరాణాషాపు దగ్ధం కావడానికి గల కారణాలపై విచారణ చేయాలని పోలీసులకు సూచించారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ చంద్రశేఖర్‌ను పిలిపించి ప్రభుత్వం తరపున బాధితురాలికి న్యాయం చేయాలని సూచించారు. టిడిపి అండగా ఉంటుందని బాధితురాలికి భరోసా ఇచ్చారు. గుండుమల తిప్పేస్వామి వెంట రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు నరసింహరాజు, మేఘనరమేష్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, కాంట్రాక్టర్ అక్కంపల్లి బాబు, బేగార్లపల్లి రవికుమార్, నాగరాజు ఉన్నారు.

ఘర్షణ జరిగిన ప్రాంతంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

హిజ్రా గ్రూపుల మధ్య ఘర్షణ.. పలువురికి గాయాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బ్రాహ్మణపల్లి జగనన్న కాలనీలో రెండు హిజ్రా గ్రూపుల మధ్య శుక్రవారం తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. బ్రాహ్మణపల్లి గ్రామంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న హిజ్రా పల్లవి ఇంట్లోకి చొరబడిన పులివెందుల, ధర్మవరం, నెల్లూరు హిజ్రాలు కత్తులు, రాడ్లతో విచక్షణా రహితంగా దాడికి తెగబడ్డారు. ఈ ఘటనతో ఆ ప్రాంతం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటుండగా బయటి ప్రాంతం హిజ్రాలు వచ్చి దాడి చేశారని హిజ్రా పల్లవి ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొంతకాలంగా ధర్మవరం, పులివెందుల, పుట్టపర్తికి చెందిన హిజ్రాల గ్రూపుల మధ్య విభేదాలు బహిర్గతం అవుతూనే ఉన్నాయి. ఇదే విషయమై ఏడాది క్రితం హిజ్రా పల్లవి గ్రూపు సభ్యులు పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్లో ధర్మవరానికి చెందిన హిజ్రా హాసిని గ్రూపుపై ఫిర్యాదు చేశారు. ఆధిపత్యం కోసమే వారి మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

మామని కడతేర్చిన అల్లుడు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

భార్యాభర్తల పంచాయితీలో తనను అవమానించాడని పిల్లనిచ్చిన సొంత మామనే కిరాతంగా నరికి చంపిన ఘటన గురువారం రాత్రి మండల పరిధిలోని నల్లదాసరిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆవుల లక్ష్మన్న (50) మూడేళ్ల క్రితం తన కూతురు లలితమ్మను కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దోల్తాపూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు ఇచ్చి వివాహం చేశాడు. వివాహమైన ఆరునెలల వరకూ కాపురం సజావుగా సాగింది. అప్పటి నుంచి చంద్రశేఖర్ రోజూ మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. ఇందులో భాగంగానే వారం క్రితం భర్తతో గొడవపడి లలిత పుట్టింటికి వెళ్లింది. ఈ విషయమై పంచాయితీ జరుగుతుండగా చంద్రశేఖర్ తన ఆరు నెలల పాపను తన వెంట పంపి మీ కూతురే మీ వద్దే పెట్టుకో అంటూ తెగేసి చెప్పాడు. దీంతో మామ లక్ష్మన్న ఆరు నెలల పాపను తల్లి నుంచి విడదీసి ఎలా పెంచుతావంటూ కోపంగా మాట్లాడాడు. దీన్ని అవమానంగా భావించిన చంద్రశేఖర్ తన అనుచరులు రామాంజనేయులు, సతీష్‌తో కలిసి గ్రామ శివారులో గురువారం రాత్రి కాపు కాసి గుంతకల్లు నుంచి ద్విచక్ర వాహనంలో ఊరికి వస్తున్న లక్ష్మన్నను వేటకొడవళ్లతో దారుణంగా నరికి చంపారు. బంధువుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

గుంతకల్లు : పట్టణంలోని బీరప్ప కాలనీలో నివాసం ఉంటున్న లోహిత్‌కుమార్ (24) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు 2వ పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ ప్రయివేటు ద్విచక్ర వాహనాల షోరూంలో మెకానిక్‌గా పని చేస్తున్న లోహిత్ కుమార్‌కు రెండేళ్ల క్రితం ఎమ్మిగనూరు చెందిన లక్ష్మీదేవితో వివాహమైంది. పెళ్లయిన కొన్ని నెలల నుంచి భార్య అనేక విషయాల్లో లోహిత్ కుమార్‌ను వేధింపులకు గురిచేస్తూ ఉండేది. దీనికితోడు ఏడాది క్రితం వీరికి సంతానం కలిగి మృతిచెందింది. అప్పటి నుంచి పుట్టింటికి వెళ్లిన ఆమె భర్త పిలిచినా కాపురానికి రాలేదు. దీంతో ఇరు కుటుంబాలు పోలీసుల సమక్షంలో పంచాయితీ కూడా చేశారు. ఈనేపథ్యంలో మనస్థాపానికి గురైన లోహిత్‌కుమార్ శుక్రవారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన మృతుడి కుటుంబ సభ్యులు లోహిత్ కుమార్ మృతికి కారణమైన భార్య లక్ష్మీదేవిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆసపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలీసుల హామీతో ఆందోళన విరమించారు.

పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

గుమ్మఘట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చిన్న, సన్నకారు రైతులు డ్రై ల్యాండ్ కింద పండ్ల తోట పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎపిఒ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పంచాయతీకి వందశాతం రాయితీతో పండ్ల మొక్కలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్‌లో దూరవిద్య కోర్సులు

కళ్యాణదుర్గం : ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ నుంచి 8 వారాలపాటు ఆన్‌లైన్‌లో దూరవిద్య వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాధాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేనెటీగల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తి, పట్టు పురుగుల పెంపకం వంటి కోర్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోనే నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోఆర్డినేటర్ కోరారు. అదనపు సమాచారం కోసం సెల్..80087 88776 నెంబరును సంప్రదించాలని కోరారు.